క్లుప్తంగా

దేవర పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

సి.బెళగల్: మండలంలోని పల్‌దొడ్డి గ్రామంలో గ్రామ దేవతల దేవర పూజలను మంగళవారం ప్రారంభించారు. సుంకులమ్మల, మారెమ్మ అమ్మవార్ల ఉత్సవాలకు రెండు రోజులపాటు పూజలు చేపడతామని గ్రామ పెద్దలు తెలిపారు. తొలిరోజు సుంకుమ్మ ఆలయంలోని అమ్మవారి రథ ప్రతిమలను సిద్ధం చేశారు. బుధవారం తెల్లవారుజామున గ్రామోత్సవంతో కుంబంకాగును ఆలయాలకు చేర్చుతారని నిర్వాహకులు చెప్పారు. ఎస్‌ఐ పీరయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

24న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 24వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తామని దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ సీతారామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ తిరుపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారమివ్వండి

గడివేముల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పదంగా సంచరించే వారిపై తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయా గ్రామాల సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వేసవి కాలం,సెలవులు కావడంతో ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను జాగ్రత్తగా దాచుకోవాలని చెప్పారు. లోన్ యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి కూలీ మృతి

పాణ్యం: మండలంలోని కొండజుటూరు గ్రామానికి చెందిన టోపి సుధాకర్ (52)ఉపాధి పనికెళ్లి అస్వస్థకు గురవగా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. వివరాలు..రోజులాగే సుధాకర్ ఉపాధి పనికి బయలుదేరాడు. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పని ప్రదేశంలో అస్వస్థతకు గురై పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య వసంతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న జెట్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి మృదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు (న్యూటౌన్): వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, పట్టువస్త్రాలు సమర్పించి, పూలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.

హమాలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

కల్లూరు: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీ పి.మదర్ సాహెబ్ కుటుంబాన్ని మార్కెట్ యార్డు పాలకమండలి, ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, మార్కెట్ యార్డు యూనియన్ల గౌరవ అధ్యక్షుడు రాముడు, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా కోరారు. కల్లూరు మండల నెరవాడ గ్రామానికి చెందిన పి.మదర్‌సాహెబ్ (44) మంగళవారం ఉదయం మార్కెట్ యార్డుకు పనికి బయలుదేరగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందాడు. యూనియన్ నాయకులతో కలసి సీఐటీయూ నాయకులు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు కొంత నగదు అందజేశారు. యూనియన్ నాయకులు షేక్షావాలి, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, షేక్ షా, రామ్ లక్ష్మణ్, హుసేన్ పాల్గొన్నారు.

తొగర్చేడులో చోరీ

పాణ్యం: మండలంలోని తొగర్చేడు గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగిందని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చాకిరెడ్డి అంజన్‌కుమార్ రెడ్డి గత నెల 29న కుటుంబ సభ్యులతో కలిసి అన్నవరం క్షేత్ర దర్శనానికి వెళ్లారు. తీర్థయాత్ర ముగించుకొని తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తాళాలు పగలగొట్టి బీరువా తలుపులు ధ్వంసం చేసి అందులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.65 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా విచారణ చేయిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితులు..

చోరీకి పాల్పడిన దొంగలను పాణ్యం పోలీసులు 24 గంటలు గడవక ముందే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎస్‌ఐతో పాటు మరికొందరు సిబ్బంది ప్రత్యేక టీంలుగా ఏర్పడి ఆనవాళ్ల ప్రకారం విచారణ చేసి దొంగల ఆచూకీ గుర్తించినట్లు సమాచారం.

హామీలు గుప్పెడు..చేసింది చిటికెడు

- అధికారంలో ఉన్నప్పుడు రెండు సార్లు గోరుకల్లును సందర్శించిన చంద్రబాబు
- చివరకు గేటు కూడా అమర్చని వైనం
- పరిశ్రమల ఏర్పాటు శిలాఫలకాలకే పరిమితం
- ఎక్కడి పనులు అక్కడే వదిలేసి ఎన్నికల సమయంలో మూడు ప్రాజెక్టులు ప్రారంభం
- తానే పూర్తి చేసినట్లు ప్రచారం
- సోలార్ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతుల్లో 40 శాతం మందికి పరిహారం ఎగ్గొట్టింది నిజం కాదా?
- ప్రస్తుతం వేగంగా సాగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులు

పాణ్యం: ఎన్నికలు సమయంలో గుప్పెడు హామీలు గుప్పించి.. అనంతరం చిటికెడు మాత్రమే చేసిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కింది. తాను అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క రంగాన్ని వదలకుండా తన ప్రచారాలకు వాడుకున్నారు. ప్రతిసారి తాను సీమబిడ్డనే అని చెప్పుకునే ఆయన.. రాయలసీమలోని ప్రాజెక్టులను తానే పూర్తి చేశానని చెప్పుకునేందుకు, ప్రచార యావతో, ప్రజలను మభ్యపెట్టేందుకు ఎక్కడిక్కడే శిలాఫలకాలను ప్రారంభించి వదిలేశారు. దీంతో పలు ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించి చివరి ఆయకట్టు రైతులకు నీరందేలా చర్యలు చేపట్టారు.

- గడివేముల మండలం మంచాలకట్ట గ్రామంలోని చెరువును తెలుగుగంగ కాల్వ నుంచి 200 హెచ్‌పీ మోటార్ల సహాయంతో నింపుతున్నారు. ప్రస్తుతం చెరువు కింద 1200 ఎకరాల్లో రెండు కార్లు పండుతున్నాయి.
- పెసరవాయి గ్రామంలో రూ.15లక్షతో కేసీ కెనాల్‌కు వాలును ఏర్పాటు చేసి నీటి మునకకు శాశ్వత పరిష్కరం చూపారు.
- ఇండస్ట్రీయల్ హబ్‌గా పేరుగాంచిన ఓర్వకల్లులో నాడు పరిశ్రమలకు, రైతులకు నీరిచ్చి శాశ్వత పరిష్కారం చూపలేదు.
- దీంతో శిలాఫలాకలు చేసిన తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి చొరవ తీసుకోలేదు.
- 2019లో ఈ సమస్యలను క్షేత్ర యిలో సీఎంకు వివరించిన ఎమ్మెల్యే కాటసాని రూ.1500 కోట్లతో 15 టీఎంసీల సామర్థ్యంతో మల్లికార్జున సాగర్‌ను నిర్మించాలని పాలనపరమైన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది.



పెండింగ్ ప్రాజెక్టులపై జగన్ దృష్టి

2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్మోహరెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. గత ప్రభుత్వం లాగా ప్రచార ఆర్భాటాలకు పోకుండా క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించారు. పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్టులకు కొత్త రూపు వచ్చింది. గోరుకల్లు జలాశయానికి ఇన్‌ఫ్లో రెగ్యులేటర్‌కు రూ.30 కోట్లతో అదనంగా రెండు గేట్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. అలాగే ప్రాజెక్టు నిర్వహణకు నిధులు మంజూరు చేశారు. గోరుకల్లు నుంచి అవుకు టన్నెల్ వరకు 57.7 కి.మీ.మేర కాల్వలకు లీకేజీలు లేకుండా 20వేలు నుంచి 30వేల క్యూసెక్కుల సామర్థ్యంతో దిగువకు నీటిని పంపేందుకు, లైనింగ్ కోసం ప్రభుత్వం రూ.630 కోట్లు ఖర్చు చేయగా పనులు చకచకా పూర్తి చేశారు. అలాగే అవుకు జలాశయంలోకి నీరు సాఫీగా వెళ్లేలా మూడు కి.మీ. మేర కొండను తొలచి టన్నెల్ ద్వారా నీటిని పంపేందుకు రూ.610 కోట్లను విడుదల చేయగా ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే గోరుకల్లు నీటి సామర్థ్యాన్ని పెంచి ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరు అందించేందుకు గాలేరుకు రూ.20 కోట్లతో గేట్లు ఏర్పాటు చేసి గోరుకల్లులో నీటి నిల్వకు కృషి చేశారు. మూడేళ్లుగా గోరుకల్లు కింద ఉన్న ఆయకట్టులో రెండు పంటలకు నీరు సమృద్ధిగా అందుతోంది. అలాగే గోరుకల్లును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది.



గాలేరు -నగరి కాల్వకు లైనింగ్ చేసిన దృశ్యం

గాలేరు లీకేజీలు గాలికి..

2016లో గోరుకల్లు నుంచి గాలేరు కాల్వలకు నీటిని వదిలిన తర్వాత లీకేజీలు ఏర్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సీనియర్ ఇంజినీర్లు, నిపుణుల మాటలను పెడచెవిన పెట్టిన చంద్రబాబు నాయుడు ఆఘమేఘాల మీద పులివెందులకు నీటిని విడుదల చేయడం విమర్శలకు దారితీసింది. 12.05 టీఎంసీల సామర్థ్యం గల గోరుకల్లు ప్రాజెక్టుకు వెనుక భాగంలో గేట్లు అమర్చితేనే నీటి నిల్వ సాధ్యమవుతుంది. లేకపోతే కేవలం 7టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. అన్నీ తెలిసినా టీడీపీ ప్రభుత్వం గేట్లు ఏర్పాటు చేయలేదు. నాణ్యత డొల్లతనం బయట పడడంతో గాలేరును చంద్రబాబు పూర్తిగా గాలికొదిలేశారు.



2020లో గాలేరుకు గేట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గోరుకల్లుపై చంద్రబాబు చిన్న చూపు..

రాయలసీమలోని నాలుగు జిల్లాలకు తాగుసాగు నీటిని అందించేందుకు గోరుకల్లు జలాశయాన్ని వైఎస్సార్ హయాంలో సుమారు 80 శాతం పనులు పూర్తి చేశారు. ఇందుకు అప్పట్లో రూ.448 కోట్లు కేటాయించారు. ఆయన మరణాంతరం ప్రాజెక్టు పనులు ప్రశ్నార్థకంగా మారాయి. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2015, 2018లో గోరుకల్లు ప్రాజెక్టును సందర్శించారు. అయినా ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించలేదు. చివరకు ప్రాజెక్టుకు గేట్లు కూడా బిగించలేకపోయారు. వైఎస్ జగన్ నియోజకవర్గమైన పులివెందులకు తాను నీళ్లిచ్చానని గొప్పలు చెప్పుకునేందుకు 2016లో గోరుకల్లు నుంచి గాలేరు ద్వారా మొదటి సారిగా నీటిని వదిలారు. అయితే అసంపూర్తి పనుల కారణంగా.. కాల్వల వెంట విపరీతమైన లీకేజీలు పడటంతో స్వల్ప వ్యవధిలోనే నీటి విడుదలను నిలిపేశారు. మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయకుండా అవుకు టన్నెల్ ప్రారంభోత్సవానికి వచ్చి తానే గోరుకల్లు పూర్తి చేసినట్లు శిలాఫలకాన్ని ప్రారంభించారు. మొదటిసారి గోరుకల్లులో 5 టీఎంసీల నీటి నిల్వ చేయడంతో గ్రామంలో నీటి ఊటలు మొదలయ్యాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏడాది పాటు మరుగుదొడ్లు, ఇళ్లలో నీరు ఉబికి పైకి వచ్చాయి. కేవలం ముందు చూపులేక, అసంపూర్తి పనుల కారణంగా సమస్యలు తలెత్తాయని విశ్రాంత ఇంజినీర్లు నాడు తెలిపారు. ఈ సమయంలోనే గోరుకుల్ల కట్ట (బండ్) లీకేజీలను గుర్తించిన ఇంజినీర్ల బృందం ప్రభుత్వానికి నివేదిక పంపింది. రూ.42 కోట్లు విడుదల చేసినప్పటికీ ఆ మేర పనులు చేయలేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఇవన్నీ నిజం కాదా బాబూ?

- సోలార్ పరిశ్రమ కోసం 2017లో 5 వేల ఎకరాల భూమి సేకరించింది. ఎకరాకు రూ.4.50 లక్షలు ఇచ్చింది. అంతేకాక 40 శాతం మంది రైతలకు పరిహారం ఎగ్గొటింది నిజం కాదా.
- గుట్టపాడు గ్రామంలో జయరాజ్ ఇస్పాత్ ప్లాంట్ నిర్మాణానికి శిలఫలకాన్ని ప్రారంభించి వెళ్లారు. అయితే పరిశ్రమకు అసరమైన సౌకర్యాలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడంతో శిలాఫలకానికే పరిమితం కావడం నిజం కాదా..
- ఉర్దూ యూనివర్సిటీకి వంద ఎకరాలకు రూ.50 కోట్లు కేటాయించారు. అయితే ఒక్క రూపాయి ఇవ్వకపోవడంతో అర్థాంతరంగా నిలిచిపోయింది వాస్తవం కాదా..
- 2017లో పర్యటించిన సందర్భంగా తడనకనపల్లెలో పార్క్ నిర్మిస్తామని, ఇంటింటికీ ఫైబర్ నెట్ ఇస్తానని చెప్పి పట్టించుకోకపోవడంపై ఏమంటారు?
- గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరగా హామీతో సరిపెట్టారు కదా..
- పాణ్యం, ఓర్వకల్లు మండలాలను ఉద్యానవన హబ్‌గా మారుస్తామని, అవసరమైతే మినీ బోర్డు ఏర్పాటు చేస్తానని ఓర్వకల్లు మండలంలో హామీ ఇచ్చింది మీరే కదా.. మరి ఆ హామీ నెరవేర్చారా?
- ఓర్వకల్లులో ఇండస్ట్రీయల్ హబ్‌కు నీరివ్వకపోవడంతో నాడు పరిశ్రమల ఏర్పాటు శిలాఫలకాలకే పరిమితమైయ్యాయా లేదా?
- మీ హయాంలో నియోజకవర్గంలో రెండు పంటలు పండించిన సందర్భం ఉందా?

వైఎస్సార్‌సీపీ నెరవేర్చిన హామీలు..

- సోలార్ భూముల రైతులకు రూ.4.50 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పరిహారాన్ని అందిస్తోంది.
- గుట్టపాడు జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ పనులు పరుగులు పెడుతున్నాయి.
- ప్లాంట్‌కు అవసరమైన 2 టీఎంసీల నీటిని ముచ్చుమర్రి లిఫ్ట్ ద్వారా పైపులైన్ కోసం రూ.350 కోట్లు మంజూరు చేశారు.
- గత ఏడాది ఓర్వకల్లు మండలం గుమ్మితం తండాలో రూ.15వేల కోట్లతో బహుళ విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.
- ఓర్వకల్లు సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి మల్లికార్జున రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు రూ.1,200 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.
- తడకనపల్లె గ్రామంలో ప్రజల విజ్ఞప్తి మేరకు 7.30 ఎకరాలు కేటాయించి రూ.1.20 కోట్లతో పాఠశాల నిర్మిస్తున్నారు.
- పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో ఉద్యాన పంటలు అధికంగా ఉన్నందున మినీ బోర్డు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేసింది.
- కందికాయ పల్లెలో గ్రీన్‌కో సంస్థ రూ.4,500 కోట్లతో, వెయ్యి మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో 700 మెగా వాట్లు సోలార్ ద్వారా, 300మెగా వాట్లు విండ్ విద్యుత్ ఉత్పత్తి చేసే పనులు ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి.



గుమ్మితం తండాలో సోలార్ పరిశ్రమకు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో నిర్వహించిన ఎద్దులు బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాల సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మొత్తం 15 ఎద్దుల జతలు పాల్గొన్న పోటీల్లో పాణ్యం మండలం, ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన బీరం బుల్స్ విజేతగా నిలువగా నిర్వాహకులు రూ.50 వేలు ప్రదానం చేశారు. పాములపాడు మండలం, తుమ్మలూరుకు చెందిన తెలుగు పల్లవి వృషభాలు రెండవ స్థానం సాధించగా రూ.40 వేలు అందజేశారు. ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన బీరం బుల్స్(చిన్న జత) మూడో స్థానం, రూ.30 వేలు సొంతం చేసుకుంది. నంద్యాల మండలం ఏ.కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వరరెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ.20 వేలు అందుకుంది. మంగలిపల్లె గ్రామానికి చెందిన మురళీమోహన్ ఎద్దుల ఐదో స్థానంలో నిలువగా రూ.15 వేలు అందజేశారు. పాణ్యం మండలం, జూటూరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దుల ఆరవ స్థానంలో నిలిచి రూ.10 వేలు దక్కించుకున్నాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు ప్రభాకర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. పోటీలకు వాడాల రామనాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎంపీటీసీ పద్మనాభరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, కమిటీ సభ్యులు కృష్ణయ్య యాదవ్, వడ్డె.మద్దిలేటి, ఎర్రన్న యాదవ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పేర్లు మారవేమీ?



కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులో మారని అధికారుల పేర్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు మారడం లేదు. గతంలో పనిచేసిన అధికారుల పేర్లు నేటికీ కొనసాగుతున్నాయి. గతంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్ జలాలుద్దీన్ పేరు సహాయ పౌర సమాచార అధికారిగా, రెండు నెలల క్రితం కర్నూలు రూరల్ తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై దేవనకొండకు వెళ్లిన డి.వెంకటేష్ నాయక్ పేరు పౌర సమాచార అధికారిగా బోర్డులో దర్శనమిస్తున్నాయి. అధికారులు మారినా వారి పేర్లు మారకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఇక్కడ తహసీల్దార్ పేరేంటి సార్.. డిప్యూటీ తహసీల్దార్ ఎవరు అంటూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే వారంతా అక్కడున్న వారిని ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



బూజునూరులో వృద్ధురాలు ఎల్లమ్మకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు మధుబాబు



కర్నూలు ఆసుపత్రిలో రంగాపురం రాముడుకు పింఛన్ అందస్తున్న వలంటీర్ సురేష్

గడివేముల: మండలంలో పింఛన్ల పంపిణీ రెండో రోజు మంగళవారం కొనసాగింది. పింఛన్‌దారుల వేలిముద్రలు సేకరించి పింఛన్ సొమ్ము అందజేశారు.

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామ సచివాలయం – 3లో క్లస్టర్ సీ–18 పరిధిలో రంగాపురం రాముడు అనే లబ్ధిదారుడు అనారోగ్యంతో నాలుగు రోజులుగా కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సురేష్ మంగళవారం అక్కడి వెళ్లి వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేశాడు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కోడుమూరులో మహిళ సమస్యను వింటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కోడుమూరు గ్రామ సచివాలయం-3,4 పరిధిలోని కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చిన్నబోయ వీధి, కల్లుపెంట వీధి కాలనీల్లో బోరును బాగు చేయించి మినీ ట్యాంకుకు నీటిని సరఫరా చేయించాలని, వివిధ కారణాల వల్ల తమకు పింఛన్లు ఆగిపోయాయని పునరుద్ధరించాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అర్హత ఉంటే వారికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే సూచించడంతో పాటు, బోరును బాగు చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూ ఏఈ ప్రసాద్, పంచాయతీ ఈఓ అజయ్ భాస్కర్‌ను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంఈఓ అనంతయ్య, గోరంట్ల,ఎర్రదొడ్డి సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షాకీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రభాకర్, ప్రతాప్ రెడ్డి, ఏకాంబరం, కౌలుట్ల, బలరాం, అయ్యప్ప, మధు పాల్గొన్నారు.

భారీ వర్షం



కంబదహాల్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కంబదహాల్‌లో నిలిచిపోయిన వర్షపునీరు

సి.బెళగల్: మండలంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. చినుకులతో మొదలైన వాన ఉదయం ఏడు గంటల అనంతరం దాదాపు గంటసేపు భారీగా కురిసింది. మండల వ్యాప్తంగా 18.4 మి.మీ.వర్షాపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. కంబదహాల్, తిమ్మందొడ్డి, పోలకల్ తదితర గ్రామాల వాగులు, వంకలు నిండుగా ప్రవహించాయి. పంట పొలాల్లో ఉన్న ఎండుమిర్చి, మొక్కజొన్న పంట, కళ్లాలో ఉన్న దిగుబడులు తడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంబదహాల్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు రావడంతో కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చండి

- జిల్లా కలెక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సిటీ): బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సున్న పిల్లల వివరాలను రోజువారి నివేదిక రూపంలో అందజేయాలన్నారు. మండలాల వారీగా ఉన్న జనాభా వివరాలు 15 రోజుల్లో ఇవ్వాలన్నారు. కాగా విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు కేటాయించిన 25 శాతం సీట్లలో 197 మంది విద్యార్థులు చేరాల్సి ఉందని, రెండో విడత దరఖాస్తులకు ఈ నెల 6 నుంచి 15వ తేదీ గడువు ఇస్తున్నామని విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కర్నూలు ఎంఈఓ విజయకుమార్ పరిధిలో అత్యధిక సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓను సస్పెండ్ చేయాలని డీఈఓకు సూచించారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించగా.. ఇకపై ఎక్కడైనా కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్నట్లు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఐరన్ ట్యాబ్లెట్లు కౌతాళం మండలంలో 1770 మందికి గానూ కేవలం నలుగురికి, మద్దికెరలో 617 మందికి గానూ 12 మందికి మాత్రమే పంపిణీ చేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి ఫోలిక్ ట్యాబ్లెట్స్ పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, సమగ్ర శిక్ష ఈఈ కరిన్న పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టర్ బంగ్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనతను గుర్తించిన బాలికలకు సైతం మూడు రోజుల్లోపు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలన్నారు. ఎన్‌సీడీ సర్వే ఇప్పటి దాకా ఎంతమంది చేశారు, ఏయే జబ్బులతో ఎంత మంది నమోదయ్యారన్న వివరాలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్ రోగుల వివరాలు సేకరించాలన్నారు. జిల్లాలో కోవిడ్ కేసులు, అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. జిల్లాలో ఇప్పటిదాకా 57 శాతం మాత్రమే ఫీవర్ సర్వే పూర్తయిందని, ఈనెల 9వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని, రోగి లక్షణాలు ఉన్నవారి శ్యాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. హొళగుందలో రక్తహీనతకు సంబంధించి డేటాను ఏఎన్ఎం డిలీట్ చేశారన్న విషయం తెలుసుకుని ఆమెపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.